# 5

# నీతిమంతులు కూడ శ్రమనొందవలెనా?

## (3:1-21)

మరొకరి తప్పిదంవలన నీవెప్పుడైనా శ్రమనొందావా? నీవు అలా పొందియున్నట్టయితే, యిర్మీయా యొక్క మనోవ్యధతో నిన్ను నీవు గుర్తించుకోవచ్చు. అతడు దేవునికి అపనమ్మకస్థుడు కాకపోయినను, అపనమ్మకస్థుల దేశం మీదికి దేవుడు తెచ్చిన తీర్పులో భాగంగా అతడు శ్రమనొందాడు.

అమాయకపు ప్రజలు శ్రమపడుతున్నట్టు అను దినము వార్తా పత్రికలు తెలుపుతున్నాయి. త్రాగి లారీ తోలుతున్నవానిచే యాక్సిడెంట్ అయ్యి ఒక చంటి బిడ్డ చనిపోయింది. కోపిష్ఠియైన ఒక తుపాకీ ధారునిచే నర్సరీ స్కూలు పిల్లలు నిర్బంధింపబడ్డారు. తమ తల్లికున్న పరాయి సంబంధిచేత పదినెలల కవలలు దెబ్బలు తిన్నారు. ఒకని కొట్టడానికి ఉద్దేశింపబడిన తుపాకీ తూటా ప్రక్కన నిలిచిన వేరొకనిలోనికి చొచ్చుకుపోయింది. ఈలాటి సంభవాలు: "నీతిమంతులు బాధింపబడుటయు దుష్టులు వర్ధిల్లుటయు ఎందుకు?" అనే జవాబు చెప్పడానికి కష్టమైన ప్రశ్నను రేకెత్తిస్తుంది.

యిర్మీయా ఈ ప్రశ్ననడిగాడు. యూదా అనుభవించిన శ్రమను అతడు దూరంనుండి వీక్షిస్తున్న ఒక ప్రేక్షకుడు కాడు. మిగిలిన దేవుని ప్రశ్నలతో పాటు తాను కూడ ప్రభువు చేయు శిక్షను అనుభవిస్తున్నవాడే. దేవుని తీర్పులోని న్యాయాన్ని గ్రహించడానికి అతడు సతమతమయ్యాడు. తన తీర్పును గూర్చి దేవుని అడగడానికి ఒక సమయంలో అతడు ఆయన యొద్దకు వచ్చాడు. "దుష్టులు తమ మార్గములలో వర్ధిల్లనేల? మహా విశ్వాసఘాతకులు సుఖింపనేల?" (యిర్మీయా 12:1బి).

అదే కాలపు మరొక ప్రవక్తయైన హబక్కూకు యిలా ఆశ్చర్యాన్ని వ్యక్తపరచాడు: "కపటులను నీవు చూచియు, దుర్మార్గులు తమకంటె ఎక్కువ నీతిపరులను నాశనము చేయగా నీవు చూచియు ఎందుకు ఊరకున్నావు?" (హబక్కూకు 1:13బి). విగ్రహారాధన చేయు బబులోను దేశము యూదాను దండించడానికి దేవుడు ఎలా ఉపయోగించుకోబోతున్నాడో గ్రహించడానికి అతడు ప్రయత్నించాడు. సమస్తానికి మనయొద్ద జవాబులు లేవనే వాస్తవం దేవుని గొప్పతనానికి రుజువైయుంది. ఆయన మార్గాలను మనమెన్నడూ గ్రహించలేకపోవచ్చు, కాని ఆయన గొప్ప జ్ఞానాన్ని మనం గుర్తించి ఆయనను స్తుతించగలం, హబక్కూకు చివరిగా చేసినట్టు:

> అంజూరపుచెట్లు పూయకుండినను ద్రాక్షచెట్లు ఫలింపకపోయినను ఒలీవచెట్లు కాపులేక యుండినను చేనిలోని పైరు పంటకు రాకపోయినను గొఱ్ఱెలు దొడ్డిలో లేకపోయినను సాలలో పశువులు లేకపోయినను నేను యెహోవాయందు ఆనందించెదను నా రక్షణకర్తయైన నా దేవునియందు నేను సంతోషించెదను. ప్రభువగు యెహోవాయే నాకు బలము ఆయన నా కాళ్లను లేడి కాళ్లవలె చేయును ఉన్నతస్థలములమీద ఆయన నన్ను నడవచేయును (హబక్కూకు 3:17-19).

మనకు జవాబులన్నీ తెలియకపోయినా, వాటిని జరిగించే ఆయనయందు మనము నమ్మికయుంచవచ్చు. యూదా నాశనం చేయబడడంతో తాను తీవ్రమైన వేదనకు గురి చేయబడినా, యిర్మీయా చేసినది అదే.

## విజయానికి ముందు తీవ్రమైన బాధ నడుస్తుంది

3వ అధ్యాయపు వర్ణనలు, రూపకాలంకారాలు వ్యక్తిగతమైన యిర్మీయా యొక్క వేదనను తేటగా చిత్రిస్తున్నాయి.

> నేను ఆయన ఆగ్రహదండముచేత బాధ ననుభవించిన నరుడను. ఆయన కటిక చీకటిలోనికి దారి తీసి దానిలో నన్ను నడిపించుచున్నాడు. మాటి మాటికి దినమెల్ల ఆయన నన్ను దెబ్బలు కొట్టుచున్నాడు ఆయన నా మాంసమును నా చర్మమును క్షీణింప జేయుచున్నాడు. నా యెముకలను విరుగగొట్టుచున్నాడు. నాకు అడ్డముగా కంచె వేసియున్నాడు విషమును మాచిపత్రిని నా చుట్టు మొలిపించియున్నాడు. పూర్వకాలమున చనిపోయినవారు నివసించునట్లు ఆయన చీకటిగల స్థలములలో నన్ను నివసింపజేసియున్నాడు. ఆయన నా చుట్టు కంచె వేసియున్నాడు. నేను బయలువెళ్లకుండునట్లు బరువైన సంకెళ్లు నాకు వేసియున్నాడు. నేను బతిమాలి మొరలిడినను నా ప్రార్థన వినబడకుండ తన చెవి మూసికొనియున్నాడు. ఆయన నా మార్గములకు అడ్డముగా చెక్కుడురాళ్లు కట్టియున్నాడు. నేను పోజాలకుండ నా త్రోవలను కట్టివేసియున్నాడు. నా ప్రాణమునకు ఆయన పొంచియున్న ఎలుగుబంటివలె ఉన్నాడు. చాటైన చోటులలోనుండు సింహమువలె ఉన్నాడు నాకు త్రోవలేకుండచేసి నా యవయవములను విడదీసి యున్నాడు. నాకు దిక్కులేకుండ చేసియున్నాడు. విల్లు ఎక్కు పెట్టి బాణమునకు గురిగా ఆయన నన్ను నిలువబెట్టియున్నాడు. తన అంబులపొదిలోని బాణములన్నియు ఆయన నా ఆంత్రములగుండ దూసిపోజేసెను. నావారికందరికి నేను అపహాస్యాస్పదముగా ఉన్నాను దినమెల్ల వారు పాడునట్టి పాటలకు నేను ఆస్పదుడనైతిని. చేదువస్తువులు ఆయన నాకు తినిపించెను మాచిపత్రి ద్రావకముచేత నన్ను మత్తునిగా చేసెను; రాళ్లచేత నా పండ్లు ఊడగొట్టెను; బుగ్గిలో నన్ను పొర్లించెను. నెమ్మదికిని నాకును ఆయన బహు దూరము చేసియున్నాడు. మేలు ఎట్టిదో నేను మరచియున్నాను. నాకు బలము ఉడిగెను అనుకొంటిని; యెహోవాయందు నాకిక ఆశలు లేవనుకొంటిని (3:1-18).

*తీవ్రమైన బాధ స్వస్థతకు మనలను సిద్ధం చేస్తుంది.* "నేను ఆయన ఆగ్రహదండము చేత బాధననుభవించిన నరుడను" అనే ప్రతిపాదన (1 వ.), యూదా వేదనను వర్ణించడానికి యిర్మీయా యోగ్యుడని స్థిరపరచుతుంది. అతడు తన వ్యక్తిగతమైన అనుభవంనుండి మాట్లాడాడు. తన రచనలు పరోక్షపు సమాచార సేకరణనుండి కలిగినవి కావు. తాను వర్ణించిన ప్రతి బాధయు తాను వ్యక్తిగతంగా అనుభవించినదే. తన

తండ్రియొక్క శిక్షాదండాన్ని పూర్తిగా చవిచూచిన కుమారుని పోలి, అతడు దేవుని ఉగ్రతయొక్క కాల్పును స్వయంగా అనుభవించాడు.

1, 2 అధ్యాయాలలో, యెరూషలేము, యూదాలు అపరిమితమైన బాధమీద యిర్మీయా దృష్టిని కేంద్రీకరించాడు. 3వ అధ్యాయంలో తన వేదనవైపు దృష్టిని మళ్లించాడు. యిర్మీయా యిక్కడ తన వ్యక్తిగతమైన ఆవేదనను గూర్చియే మాట్లాడాడో లేక తన దేశపు ప్రతినిధిగా ఉత్తమ పురుషలోనే ఆ జనము యొక్క వేదనను గూర్చి మాట్లాడాడో మనం నిశ్చయంగా చెప్పలేం. ఆ దేశం అనుభవించిన వేదన, బాధ అనేవి తాను కూడ అనుభవించినవే గనుక, తన సొంత అనుభవపు మాటలలోనే ఆ దేశం కొరకు అతడు మాట్లాడియుండవచ్చు.[1] తీవ్రమైన వేదన కాలములో, మనము సహజంగానే, "మనమీదను మన దుఃఖముమీదను దృష్టి నిలుపుతాం" అని Charles Swindoll సూచించాడు.[2]

యిర్మీయా యొక్క వ్యక్తిగతమైన బాధలు యోబు (నందు)చే వర్ణింపబడినవాటిని గుర్తు చేస్తున్నాయి. అధ్యాయమంతటి సందర్భం ఆలోచింపకుంటే, దేవుడు తనకు అన్యాయం చేసినట్టు యిర్మీయా నిందవేస్తున్నాడని మనం తలంచవచ్చు. దేవుని దర్శించి, ఆయన జోక్యం కొరకు వేచియుండవలసిన అవసరత కొరకు రంగం సిద్ధం చేయడానికి గాను అతడు తన ఆవేదనను తన దేశపు ఆవేదనను వాస్తవంగా వర్ణిస్తున్నాడు. 1నుండి 18 వచనాలలోని దుఃఖ భరితమైన స్థితికి ఉపశమనం లేదు. దేవుడు తన సొంత కాలంలో తన ప్రజలను విడిపిస్తాడని యిర్మీయాకు తెలుసు. ఆ కాలం కొరకు వారిని సిద్ధపరచుటకు శ్రమ వారికి అవసరమని యిర్మీయా ఎరుగును. వేదనకు ముందు వచ్చే సహాయము చౌకబారుదిగా ఉంటుంది. బావి ఎండిపోయేవరకు వచ్చే నీటి వనరును మనం అంతగా అభినందించము. తేలికగా మరో మూలంనుండి నీళ్లు లభించినా మనం దాన్ని అభినందించ నేర్చుకొనకపోవచ్చు!

వేదన, బాధ, అనేవి దేవుడు మాత్రమే స్వస్థతను చేకూర్చగలడు అనే సహజ సత్యాన్ని బయలుపరుస్తుంది. మనకు అవసరమైన సహాయం కొరకు మనము ఆయనవైపు తిరుగునట్లు దేవుడే ఆవేదనను మనకు ప్రసాదించవచ్చు. వ్యక్తిగతమైన సొంత బాధయొక్క రూపంలో తన దేశము యొక్క శ్రమకు స్వస్థతకు యిర్మీయా రంగాన్ని సిద్ధం చేశాడు.

*చీకటి వెలుగుకొరకు మనలను సిద్ధపరచును.* దేవుడు తనకు దయచేసిన వాతావరణాన్ని వర్ణించడానికి రచయిత చీకటిని ఉపయోగించాడు (2, 6 వచనాలు). పాపము యొక్క దుర్గంధమును దాని మురికిని, మష్టును చూచేలా, జీవితము యొక్క అంధకారపు భాగంలో అతడు నడిచాడు. అది వెలుగే నివసింపని ఊపిరి తిరుగని అంధకారమైయుంది. దీర్ఘకాలంగా మృతుడైయున్న ఒకని సమాధి లోపలనున్న అంధకారము వంటిదిగా అది ఉంది.

*శిక్షచేయు దేవుని హస్తము సహాయము చేయు దేవుని హస్తముకొరకు మనలను సిద్ధపరచును.* ఒక్క దినపు కాలంలో (3 వ.) దేవుని హస్తము మాటిమాటికి యిర్మీయాకు వ్యతిరేకముగా త్రిప్పబడినట్టు అతడు చూచాడు. అపాయకరమైన మార్గంలో నడిచేటప్పుడు చిన్నబిడ్డ పెద్దవారి చేయిని అంటుకొని నడుచునట్టుగా, దేవుని చేయి పట్టుకొనియుండ వలసింది. ఏదియెలాగున్నా, ఈ పరిస్థితిలో, యిర్మీయా ఆయన చేయిని పట్టుకొన

కుండడం మాత్రమే గాక, మార్గానికి అడ్డంగా కూడ దాన్ని ఉపయోగించినట్టున్నాడు.

యూదా ప్రజలవలెనే, యెరూషలేము పట్టబడినప్పుడు, యిర్మీయా తన వయస్సుకు మించినవాడైయున్నట్టు అయ్యాడు (4, 5 వచనాలు). భోజనపానాదులు లేనందున, మాంసము క్షీణించి అతని చర్మము సాగినట్టుంది ముసలివానిలా అతని చర్మము ముడతలు పడింది. అతడు కష్టములచేతను, అలసటచేతను ఆవరించియున్నాడు.

*దేవుని వీపుని చూచుట ఆయన ముఖ దర్శనం చేసికొనడానికి సిద్ధపరచును.* బబులోను సైన్యముచే యెరూషలేము ముట్టడివేయబడిన రెండు సంవత్సరాల కాలంలో ప్రవక్త యొక్క యిక్కట్లను గూర్చి 7నుండి 9 వచనాలవరకు వర్ణింపబడినట్టుంది, లేక గోతిలో పడవేయబడిన అనుభవాన్ని గూర్చి అది మాటలాడియుండవచ్చు. అతనిచుట్టు కంచె వేయబడింది, సంకెళ్లతో బంధింపబడియున్నాడు. పెద్ద క్యారీ రాళ్లచేత అతడు చుట్టబడియున్నాడు. అతడు ఎంత ఏడ్చినా మొత్తుకున్నా, దేవుడు ఆలకించనట్టు కన్పించాడు. తన ప్రవక్తనుండియు, తన ప్రజలనుండియు ఆయన తొలిగిపోయినట్టున్నాడు.

దేవుడు అతనికి ఊతయు, బలమునైయున్నాడు, తన సైన్యాధిపతియు, సైన్యముగా ముందుకు సాగు ఆజ్ఞలను జారిచేసియున్నాడు. యిర్మీయా నిరంతరము అవిధేయుడయ్యే దానికంటె కష్టమైనప్పుడు కూడ ఆయనకు లోబడడానికి కృషి చేస్తునేయున్నాడు. ఈ సమయములో దేవుడు ఎలుగుబంటిగానో, సింహముగానో ఉండి తనను చీల్చి వేయడానికి పొంచియున్నట్టు అతనికి కన్పించాడు. తాను గురిగాను, దేవుడు అతనిని బాణములతో కొట్టుతున్నట్టుగాను అతడు ఫీలయ్యాడు (10-13 వచనాలు).

*ఇతరులచేత అవమానపరచబడి, హేళనచేయబడినది దేవుని ఆహ్వానానికి మనలను సిద్ధపరచుతుంది.* యిర్మీయా యొక్క స్వజనులే అతని హేళనచేసి, గేలిచేయడానికి పాటలను కట్టారు, అతని కష్టము చూచి పత్రి ద్రావకముగా యిచ్చి చేదు వస్తువులు అతనిచేత తినిపించాడు. ఆత్మ యొక్క చేదు అనుభవాలను నోటికి అందింపబడిన చేదు వస్తువులుగా వర్ణించబడ్డాయి (14, 15 వచనాలు).

*దేవుని కొరకైన ఆకలి దేవునిచే తృప్తిపరచబడడానికి మనలను సిద్ధపరచును.* యిర్మీయా శ్రమయొక్క బహు తేటైన మరీ బలీయమైన వర్ణనలలో ఒకటిగా 16నుండి 18 వచనాలు వర్ణిస్తున్నాయి. ఆకలితో అలమటించేవారు రంపపు పొట్టును, ఎండిపోయిన ఆకులను, లేదా మన్నును సహా తింటారు. అతడు గోతిలో వేయబడినప్పుడు, రాళ్లను మట్టితో కలుపుకొని తినునంతగా ఆకలిగొనియుంటాడా? ఒకవేళ చెరసాలలో వేయబడి నప్పుడు, నీళ్లును కాల్చబడిన ఒక రొట్టియు మాత్రమే యిస్తుండేవారు (యిర్మీయా 37:21), అతని భోజనము ఆ బందీ గృహములోని నేలపై మట్టిలోనో దుమ్ములోనో పడవేసేవారేమో. అదే అతడు తినేవాడేమో. అప్పుడు తన పండ్లు విరిగాయో లేక అరిగిపోయాయో. బూడిద కుప్పలలో అతడు పొర్లచేయబడ్డాడో లేక దానితో కప్పబడ్డాడో తెలియదు. అది అతని నలిగిన, అణచబడిన స్థితిని సూచిస్తుంది.

ప్రతివారు కోరే లేక వాంఛించే, అవసరమైన నాల్గు విషయాలు – సమాధానము (శాంతి), ఐశ్వర్యము, నిరీక్షణ, బలము అనేవి అతనికి లేకపోయాయి. ఇవన్నీ దేవుడు పంపిన నాశనంవలన లేకుండాపోయాయి. అన్నిటికి మించి, సహించరానిది నిరీక్షణను

కోల్పోవడం. భవిష్యత్తులో ఏదైన చిన్న నిరీక్షణ ఉంటే, ఈ మూడు లేకపోయినా ఒకడు జీవించగలడు. కొండలోగుండా తొలువబడిన దీర్ఘమైన దారికి చివరిగా నిలిచే ఆశా జ్యోతి నిరీక్షణయే. నిరీక్షణ సజీవంగా ఉంటే, శాంతి, ఐశ్వర్యం, బలము అనేవి నిలిచి వేచియుండగలవు. యూదా దేశం మీద నిరీక్షణలేమి ప్రళయ మేఘంలా యూదాపై విలయతాండవం చేస్తుంది.

## నిరీక్షణ పొడుచుకువస్తుంది

యిర్మీయా తన మనో దుఃఖములో మునిగిపోతుండే సమయంలో, తన బలము నిరీక్షణ అంతా పోయినప్పుడు, మేఘాలలోనుండి సూర్య కిరణాలు వెలుపలికి వచ్చినట్టు, అతనికి నిరీక్షణ కలిగింది. "నా శ్రమను నా దురవస్థను నేను త్రాగిన మాచిపత్రిని చేదును జ్ఞాపకము చేసికొనుము. ఎడతెగక నా ఆత్మ వాటిని జ్ఞాపకము చేసికొని నాలో క్రుంగియున్నది. అది నీకింకను జ్ఞాపకమున్నది గదా. నేను దీని జ్ఞాపకము చేసికొనగా నాకు ఆశ పుట్టుచున్నది" (3:19-21).

తాను నిరీక్షణను ఎలా కనుగొన్నాడు? అతడు దేవుని జ్ఞాపకం చేసికొన్నాడు. కేవలం యెహోవా నామము ప్రస్తావించడం ఆయన జ్ఞాపకాలను రగిలించింది. "నా శ్రమను నా దురవస్థను నేను త్రాగిన మాచిపత్రిని చేదును జ్ఞాపకము చేసికొను"మంటూ, అతడు తన కేసును మహోన్నతుని యొద్దకు కొనిపోయాడు. తన మార్గాన్ని గాఢమైన వేదన తాత్కాలికంగా అడ్డగించినా, అతడు యింకను దేవుని జ్ఞాపకం చేసికొని ఆయన సన్నిధిని సాగిలపడ్డాడు.

దేవునియందు నిరీక్షణ ఎల్లప్పుడు లభిస్తుంది. యెహోవాను జ్ఞాపకం చేసికొనడం యిర్మీయా అంతరంగంలో నిరీక్షణా జ్వాలలను రగిలించింది. బ్రద్దలైపోయిన జీవిత నావకు రిపేరు జరిగేవరకు నిరీక్షణ అనేది ఓడరేవుగా నిలిచియుంది.

---

## సందేశమేమి?

నిరీక్షణ లేని భావనతో నీవెప్పుడైనా బాధింపబడ్డావా? నీవు ప్రేమించిన ఒకరు బాధపడినందున నిస్సహాయ స్థితియనే భావన ద్వారా నీవు బాధననుభవించావా? అమాయకులు శ్రమలననుభవిస్తున్న దాని వెనుకనున్న న్యాయాన్ని నీ వెప్పుడైనా ప్రశ్నించావా?

యిర్మీయా చేసిన రెండు కార్యాలు నిరీక్షణను చూచేలా తనకు సహాయం చేశాయి. మొదటిగా, అతడు తన వేదనను వెలిబుచ్చాడు. దుఃఖాన్ని జయించడానికి Dr. Bill Flatt పది మెట్లును అవుట్ లైన్ చేశాడు. ఆ జాబితాలో దాన్ని గూర్చి మాట్లాడడం అవసరం, దాన్ని వ్యక్తపరచు[3] అనేది చేర్చబడింది. మూడవ అధ్యాయం తొలి 18 వచనాల్లో, యిర్మీయా తన దుఃఖాన్ని, ఆవేదనను వ్యక్తపరచాడు. మనం ఎలా ఫీలౌతున్నామో దాన్ని ఒక స్నేహితునితోనో, లేక శ్రేయోభిలాషితోనో మాట్లాడుతున్నప్పుడు, అందులోనుండి వైరుధ్యాలు, దుఃఖము వెలుపలికి వెళ్లిపోతాయి. అవి మార్గంలోనుండి తప్పుకున్నప్పుడు,

దూరపు దిఙ్మండలమునుండి బాగుపరచే సూర్యుడు ఉదయిస్తుంటాడు.

కష్టకాలంలో గుండా ఎవరికైనా సహాయం చేయాలని నీవు ప్రయత్నించితే, అతి శ్రేష్ఠమైన విషయాల్లో ఒకటి అతని మాటలనాలకించు, తన ఫీలింగ్స్‌ను వ్యక్తపరచనిమ్ము. తరుచుగా, ఏమైనా చెప్పడం అవసరమైయుండవచ్చు. అతనికి దయను, ప్రేమను, అతని పట్ల అక్కరను కనుపరచడం తప్ప మరేమియు చెప్పనవసరముండదు.

రెండవది, యిర్మీయా తన మనోవ్యధను దేవుని యొద్దకు కొనిపోయాడు, దేవుడు ఎల్లవేళల ఉన్నవాడన్న సంగతిని అతడు జ్ఞాపకం చేసికొన్నాడు. శ్రమానుభవాలు మనోహరమైనవనే సంగతి కొద్దిమంది మాత్రమే గ్రహించగలరు. సర్వాన్ని గ్రహించిన ఒకాయన మనకున్నాడు. ఏ నరుడు అనుభవించలేనంత మహా వేదనను ఒంటరితనాన్ని ఆయన అనుభవించారు. "తాను శోధింపబడి శ్రమపొందెను గనుక శోధింపబడినవారికి సహాయము చేయగలవాడైయున్నాడు" (హెబ్రీ. 2:18). హెబ్రీ. 4:16 మనలను యిలా ఆహ్వానిస్తుంది, "గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయముకొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనమునొద్దకు చేరుదము."

భౌతిక (ప్రాణము) జీవితము కంటె మన నిత్య ఆత్మ కొరకు దేవుడు ఎక్కువ శ్రద్ధగలవాడైయున్నాడు. శ్రమకు సంబంధించిన ఆయన సందేశం ఆయన వాక్యంలో యివ్వబడింది:

> నా సహోదరులారా, మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని యెరిగి, మీరు నానావిధములైన శోధనలలో పడునప్పుడు, అది మహానందమని యెంచుకొనుడి. మీరు సంపూర్ణులును, అనూనాంగులును, ఏ విషయములోనైనను కొదువలేనివారునై యుండునట్లు ఓర్పు తన క్రియను కొనసాగింపనీయుడి (యాకోబు 1:2-4).

మనము సంపూర్ణులమును లోపములేనివారునైయుండునట్లు శోధనలు, పరీక్షలు, శ్రమలు నిత్యత్వపు విలువలను పెంపొందించుతాయి. అవి క్రీస్తు శ్రమలలో పాలివారమై నట్టు మనకు సహాయము చేయవచ్చు. అవి మనలను దేవుని సముఖములో సంపూర్ణులుగా చేస్తాయి. ఆయన శ్రమలలో మనము పాలివారమగునట్లు నిర్ణయించబడ్డాం.

అమాయకులు శ్రమపొందడంలో కూడ ఉపకారములు లేకుండపోలేదు. ఆ ఉపకారములు నేరుగా మనకు ప్రత్యక్షం కాకపోవచ్చు. మన తప్పులవలన మనమీదికి తెచ్చుకున్న యిబ్బందులనుండి కాక, తక్కిన ఏ బాధనుండైనా మనం కాపాడబడి భద్రపరచబడియున్నట్టయితే, జీవితపు పరీక్షలకు మనము సన్నద్ధులమైయుండము. శ్రమలు మనలను దిట్టపరుస్తాయి. తరువాత మన జీవితపు పోరాటముల కొరకు అవి మనలను సిద్ధపరుస్తాయి, సన్నుద్ధులనుగా చేస్తాయి.

సమస్తము దేవుని స్వాధీనంలో ఉంది. ఆయన ఏమి చేస్తున్నాడో తనకు తెలుసు. దేవుడు ఎంతగా మనకొరకు చింతిస్తున్నాడో యెరిగిన ఒక వ్యక్తి యిలా అన్నాడు, "దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్ఠమైన చేతిక్రింద దీనమనస్కులై యుండుడి. ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింతయావత్తు ఆయన మీద వేయుడి" (1 పేతురు 5:6, 7). మనము శ్రమపడినప్పుడు

ఆనుకొనడానికి ఒకరు మనకు కావలసినంతగా, మనం ఎందుకు శ్రమ అనుభవిస్తున్నామో తెలిసికొనవలసిన అవసరం లేదు.

సూచనలు

[1]James E. Smith, *Jeremiah and Lamentations*, Bible Study Textbook Series (Joplin, Mo.: College Press, 1974), 879. [2]Charles R. Swindoll, *The Lamentations of Jeremiah* (Waco, Tex.: Insight for Living, 1986), 27. [3]Bill W. Flatt, *From Worry to Happiness* (Nashville: Christian Communications, 1979), 80-82.